ప్రజాశక్తి

గురువారం 14 సెప్టెంబర్ 2023

5

విజయనగరం

సిఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 15న ముఖ్యమంత్రి పర్యటనకు ఒక అదనపు ఎస్‌పి,ఆరుగురు డిఎస్‌పిలు, సుమారు 900మంది సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. బుధవారం బందోబస్తు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బందోబస్తును వివిధ కేటగిరిలుగా విభజించి, భద్రత ఏర్పాట్లు చేసామని, ఒక్కో విభాగానికి ఒక్కొక్క పోలీసు ఉన్నతాధికారిని బాధ్యులుగా నియమించామన్నారు. హెలిప్యాడ్, పార్కింగు, కాన్వాయ్, వైఎస్ఆర్ విగ్రహ ఆవిష్కరణ, శిలా ఫలకం, రూట్ బందోబస్తు, ట్రాఫిక్ రెగ్యులేషన్, పార్కింగు, వైద్యకళాశాల భవనంవద్ద విధులు నిర్వహించేందుకు ప్రత్యేకంగా అధికారులను, సిబ్బందిని నియమించామన్నారు. పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అన్ని భద్రతా చర్యలు చేపట్టామని తెలిపారు. సమావేశంలో ఎఎస్‌పి అస్మా ఫర్దీన్, డిఎస్‌పిలు , సిఐలు, ఉన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి నాయకుల నిరాహారదీక్షలు ● విజయనగరం, పార్వతీపురం, గజపతినగరంలో అరెస్టులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని టిడిపి నాయకులు ధ్వజమెత్తారు. నిరసన తెలిపే హక్కును సైతం కాల రాస్తోందని మండిపడ్డారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి నాయకులు బుధవారం విజయనగరం, పార్వతీపురం మన్యంజిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లోనూ రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. విజయనగరం, పార్వతీపురం, గజపతినగరంలో దీక్ష చేస్తున్న నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. బాబుకు తోడుగా ఒక నియంత పై పోరాటం కోసం మేము సైతం అంటూ ఈ దీక్షలను చేపట్టారు. విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరాహారదీక్ష సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా రాష్ట్రంలో లక్షల మంది యువతకు ఉపాధిని చూపించిన ఘనత చంద్రబాబు నాయుడుదేనని అన్నారు ఈ నేపథ్యంలో శాంతియుతంగా నిరసన చేస్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా ప్రతిఘటించారు. ఈసందర్భంగా పోలీసులు నాయకులందరినీ ఈడ్చుకుపోయి వ్యాన్లలో ఎక్కించి టూ టౌన్ స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం వారందరినీ విడిచిపెట్టారు. అరెస్టు అయిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు విజయనగరం పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, వి. ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. **గరివిడి :** చీపురుపల్లిలో చేపట్టిన నిరాహారదీక్షల్లో జయనగరం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున మాట్లాడుతూ కక్షపూరిత, ఫ్యాక్షన్ మనస్తత్వం ఉన్న వ్యక్తి రాష్ట్రంలో పరిపాలన సాగించడం ప్రజలందరి దురదృష్టమని అన్నారు. నాలుగున్నరేళ్ల వైకాపా పాలనలో జగన్ చేసిన అభివృద్ధి ఏమైనా ఉందంటే.. విధ్వంసం, అల్లకల్లోలమేనని విమర్శించారు. రాష్ట్రంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు కూడా లేదా? అని ప్రశ్నించారు. ప్రజల గొంతు నొక్కడమే జగన్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. తమ అధినేత చంద్రబాబుపై ఒక కేసు తర్వాత మరో కేసు పెట్టి, బయటకు రానీయకుండా చేసి, పార్టీని బలహీనపర్చాలని చూస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే రామతీర్థం ఘటనను తెరపైకి తీసుకొస్తున్నట్లు తెలుస్తోందన్నారు. రిలే నిరాహార దీక్షల్లో టిడిపి నాయకులు రౌతు కామునాయుడు, పైల బలరాం, సారిపాక సురేష్‌బాబు, తాడ్డి సన్యాసినాయుడు, కెంగువ ధనుంజయ; రౌతు నారాయణరావు, దన్నాన రామచంద్రుడు, దన్నాన సూరపునాయుడు, శనపతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **గజపతినగరంలో** నియోజకవర్గ ఇంఛార్జి కెఎ నాయుడు ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దత్తిరాజేరు టిడిపి మండల అధ్యక్షులు పెద్దింటి మోహన్, నాయకులు, క్లస్టర్ ఇంఛార్జిలు బెజవాడ బంగారు నాయుడు, మజ్జి మహేష్, ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు సీర రామారావు, మండల మహిళా అధ్యక్షులు గేదెల మంగమ్మ, పార్టీ నాయకులు కొండబాబు రాజు, మిత్తిరెడ్డి గౌరి నాయుడు, సాలాపు గౌరి నాయుడు, గేదెల రామసత్యం, తాడ్డి గణేష్ తదితరులు పాల్గొన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కరణం శివరామకృష్ణ జాతీయ రహదారి పక్కన రిలే నిరాహారదీక్ష చేపట్టగా అనుమతి లేదంటూ పోలీసులు దీక్షను భగ్నం చేసి అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. **బొబ్బిలిలో** చంద్రబాబుకు బెయిల్ రావాలని కోరుతూ బుధవారం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, కార్యకర్తలు పూజలు చేశారు. ఆలయం వద్ద 108 కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ, మండల అధ్యక్షులు రాంబార్కి శరత్, వి.సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దీనికి ముందు బేబినాయన ఆధ్వర్యంలో బొబ్బిలి కోటలో నిరాహారదీక్షలు చేపట్టారు.. **నెల్లిమర్ల** నియోజకవర్గం కేంద్రంలో టిడిపి ఇంచార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో దీక్షలు చేశారు. అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మహంతి చిన్నంనాయుడు, కంది చంద్రశేఖర రావు, సువ్వాడ వనజాక్షి, పతివాడ అప్పలనారాయణ, పతివాడ తమ్మినాయుడు, ఆకిరి ప్రసాద్ రావు, టిడిపి పూసపాటిరేగ, భోగాపురం మండల అధ్యక్షులు మహంతి శంకర్రావు, కర్రోతు సత్యనారాయణ, పతివాడ శివరామ విద్య సాగర్ నాయుడు, కలిదిండి పాణీరాజు, బైరెడ్డి లీలావతి, చిల్ల పద్మ, చింతపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. **మెంటాడ** మండల కేంద్రలో టిడిపి నాయకులు నిరసన ర్యాలీ, అనంతరం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో అరుకు పార్లమెంటు ఉపాధ్యక్షులు గెద్ద అన్నవరం, నాయకులు గొర్లె ముసలి నాయుడు, రెడ్డి రాజగోపాల్, రెడ్డి ఎర్రి నాయుడు, కుంటినవలస సర్పంచ్ రమేష్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి సిరిపరపు గురునాయుడు, తాడ్డి తిరుపతి, రెడ్డి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు. **శృంగవరపుకోటలో** దారగంగమ్మ ఫంక్షన్ హాల్లో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు బుధవారం రిలే నిరాహార దీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి వెంకన్న, కొనదం మల్లేశ్వరరావు, నానిగిరి రమణ, జిజి ఎస్ నాయుడు, చెక్క కిరణ్ కుమార్, కాపుగంటి వాసు, బర్మా కాలనీ సాయి, అనకాపల్లి చెల్లయ్య, పెదగాడ రాజు, కె ఈశ్వరరావు, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదిర్శి గొంప కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక ఆకుల డిపో వద్ద నియోజకవర్గ నాయకులు, మహిళలు, యువత, కార్యకర్తలతో కలసి రిలే నిరాహారదీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో లగుడు రవి కుమార్, గొంప వెంకటరావు, గొరపల్లి రాము, రాయవరపు చంద్రశేఖర్, పైడి బాబు, బండారు పెదబాబు, గుమ్మడి భారతి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో టిడిపి నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు



ఎస్.కోట : నిరాహారదీక్ష చేస్తున్న గొంప కృష్ణ తదితరులు

చీపురుపల్లి : దీక్షలో మాట్లాడుతున్న కిమిడి నాగార్జున

గజపతినగరం : కరణం శివరామకృష్ణను అరెస్టు చేస్తున్న పోలీసులు

బొబ్బిలి : నిరాహారదీక్ష చేస్తున్న బేబినాయన తదితరులు

వైద్య కళాశాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి ఎం.దీపిక

ముఖ్యమంత్రి పర్యటన ఖరారు

- వైద్య కళాశాల ప్రారంభానికి ముమ్మరంగా ఏర్పాట్లు
- పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జిల్లాకు రాక ఖరారైంది. ఈ విషయాన్ని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వెల్లడించారు. ముఖ్యమంత్రి ఈనెల 15న ఉదయం 10.30 గంటలకు హెలికాప్టర్‌లో జెఎన్‌టియు సమీపంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారని, 10.45 గంటలకు వైద్య కళాశాల ప్రాంగణానికి చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. అనంతరం వైద్య కళాశాల ప్రారంభానికి సంబంధించిన శిలాఫలకం ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్, స్కిల్ ల్యాబ్‌లను సందర్శిస్తారని తెలిపారు. అనంతరం బయోకెమిస్ట్రీ ల్యాబ్, అనాటమీ మ్యూజియం పరిశీలిస్తారని పేర్కొన్నారు. 11.30 గంటలకు లెక్చర్ హాలుకు చేరుకొని రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఐదు ప్రభుత్వ వైద్యకళాశాలల్ని వర్చ్యువల్‌గా ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు సందేశాలు ఇస్తారని, అనంతరం ఐదు కళాశాలల వైద్య విద్యార్థులతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడతారని తెలిపారు. అనంతరం హెలిపాడ్‌కు చేరుకొని జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో సమావేశం అవుతారని పేర్కొన్నారు. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్‌పి ఎం.దీపిక, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌లు ఏర్పాట్లను పరిశీలించి ఆయా వేదికలకు ఇన్‌ఛార్జిలుగా వ్యవహరిస్తున్న అధికారులకు సూచనలు చేశారు. ల్యాబ్‌లను సంబంధింత పరికరాలు, ప్రదర్శన అంశాలతో సిద్ధంచేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డా.పద్మలీలను ఆదేశించారు. లెక్చర్ హాలులో ప్రధాన కార్యక్రమ వేదిక వద్ద వీడియో కాన్ఫరెన్సింగ్, ప్రత్యక్ష ప్రసారం, తదితర ఏర్పాట్లపై సూచనలు చేశారు. వైద్య మౌళిక సదుపాయాల సంస్థ అధికారులు ఎస్.ఇ. శివకుమార్, ఇఇ బి.ఎన్.ప్రసాద్ తదితరులు కళాశాల ప్రాంగణంలో చేస్తున్న ఏర్పాట్లపై వివరించారు. ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, కార్పొరేషన్ కమిషనర్ శ్రీరాములు నాయుడు, ఎస్.డి.సి. సూర్యనారాయణ, తహశీల్దార్ కె.శ్రీనివాసరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించిన ఉపసభాపతి, జెడ్‌పి చైర్మన్

విజయనగరం టౌన్ : ముఖ్యమంత్రి పర్యటనకు త్వరితగతిన అన్ని ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధికారులకు ఆదేశించారు. బుధవారం జెఎన్‌టియు సమీపంలోని హెలిప్యాడ్ స్థలాన్ని, వైద్యకళాశాల పనులను వారు పరిశీలించారు. ఇప్పటి వరకూ చేసిన ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. హెలిప్యాడ్ ప్రదేశం నుంచి కళాశాలకు వచ్చే వరకూ ఏర్పాట్లు పక్కాగా చేయాలని సూచించారు. జిల్లా ప్రజల చిరకాల కోర్కెనైన వైద్యకళాశాలను నెరవేర్చినందుకు ముఖ్యమంత్రికి కతజ్ఞతలు తెలియజేసేలా వివిధ కార్యక్రమాలు రూపొందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ సూర్యకళ, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ పద్మలీల, ఇతర అధికారులు ఉన్నారు.

ముమ్మరంగా పనులు

ముఖ్యమంత్రి పర్యటన ఖరారైన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. వైద్య కళాశాల భవనానికి ఎపిఎంఎస్‌ఐడిసి ఆధ్వర్యంలో వందలాది కార్మికులు తుదిమెరుగులు దిద్దుతున్నారు. కళాశాల ప్రాంగణంలో పచ్చదనం పెంచేలా పనులు చేపట్టడంతోపాటు వైద్య కళాశాల ప్రధాన ప్రవేశద్వారం నిర్మాణ పనులు, ప్రాంగణంలో అంతర్గత రోడ్ల నిర్మాణం, భవనానికి రంగులు అద్దడం, పరిశుభ్రం చేసే పనుల్లో సుమారు 800 నుంచి 1000 మంది వరకు కార్మికులు పాల్గొంటున్నట్టు వైద్య మౌళిక సదుపాయాల సంస్థ ఎం.డి. మురళీధర్ రెడ్డి తెలిపారు.

గాయత్రి ఆస్పత్రిలో ఆధునిక శస్త్రచికిత్సలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని గాయత్రి ఆస్పత్రిలో కొక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సలను బుధవారం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించారు. బుధవారం ఆసుపత్రి లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొట్టమొదటి సారిగా గాయత్రి హాస్పిటల్‌లో కొక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచకిత్స నిర్వహించిన డాక్టర్ కృష్ణ కిషోర్, డాక్టర్ బి.వెంకట్, డాక్టర్ సునీల్,డాక్టర్ మనోహర్‌లను ఆయన అభినందించారు. సుమారు రూ.8 లక్షలు విలువ చేసే ఆపరేషన్లను ఉచితంగా ఆరోగ్య శ్రీ లో చేయించుకునే అవకాశాన్ని విజయ నగరం, శ్రీకాకుళం ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. పుట్టుకతో వచ్చే చెవిటి మూగ పిల్లలు సంప్రదాయ వినికిడి మిషన్ తో ప్రయోజనం పొందలేకపోతే ఈ శస్త్రచిత్స ద్వారా వినికిడి తో పాటు స్పష్టంగా మాట్లాడే అవకాశం కూడా కలుగుతుందని చీఫ్ మెంటర్ సర్జన్ డాక్టర్ కృష్ణ కిషోర్ తెలిపారు. మూడేళ్లలోపు పిల్లలకు ఇద్దరికి గాయత్రి హాస్పిటల్ లో శస్త్రికిత్స చేశామని, వీరికి నెల రోజుల తరువాత ఇంప్లాంట్ స్విచ్ ఆన్ చేస్తామని తెలిపారు. ఏడాది పాటు ఆడియో వెర్బల్ తెలిపి (ఎవిటి) ద్వారా అందరి పిల్లలు మాదిరి రెగ్యులర్‌గా స్కూలుకు వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. డాక్టర్ వెంకట్ మాట్లాడుతూ వినికిడి లోపం ఎంత తక్కువ వయసు లో గుర్తించి సర్జరీ చేయించుకుంటే అంత మంచి ఫలితం ఉంటుందని తెలిపారు. గాయత్రి హాస్పిటల్‌లో ఎడిఐపి, ఆరోగ్య శ్రీ ద్వారా సర్జరీ, సంవత్సరం పాటు ఆడియో వెర్బల్ థెరపీ పూర్తిగా ఉచితంగా చేస్తామని తెలిపారు.

వైద్యులను అభినందిస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ

రాజకీయపార్టీల నాయకుల సమావేశంలో డిఆర్ఒ

ప్రజాశక్తి-విజయనగరం

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పార దర్శకంగా జరుగుతోందని, ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడే అధికారులు, సిబ్బంది పని చేస్తున్నారని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి. అనిత స్పష్టం చేశారు. ఓట్ల తొలగింపునకు సంబంధించి సహేతుకమైన కారణాన్ని చూపుతున్నా మని, ఆ తర్వాతే ప్రక్రియను సాగిస్తున్నామని పేర్కొన్నారు. ఇంటింటి సర్వే సజావుగానే జరిగిందని, గుర్తించిన సమస్యలకు శాశ్వతమైన పరిష్కారం చూపామని వివరించారు. ఓటర్ల జాబితా సవరణ, ఇతర అంశాలపై సమీక్షించే నిమిత్తం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. పలు పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆమె బదులిచ్చారు. ఇప్పటి వరకు తీసుకున్న చర్యలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు డిఆర్ఒ వివరించారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ గురించి వెల్లడించారు. ఇంటింట సర్వేలో బిఎల్ఒలకు, బిఎల్ఎలను అనుసంధానం చేస్తామని, ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ అనిత

పరిశ్రమల కాలుష్యం నుంచి కాపాడాలి

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ పాల్

ప్రజాశక్తి - పూసపాటిరేగ

కాలుష్యం కోరలు నుంచి ప్రజలను కాపాడాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ పాల్ అన్నారు. బుధవారం శ్రీకాకుళంనుంచి వస్తూ కందివలస గెడ్డ వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డీస్‌ల్యాబ్, అరబిందో పరిశ్రమలు సంవత్సరానికి లక్షల కోట్లు సంపాదించి ప్రజలకు సదుపాయాలకు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ ప్రాంతంలో ఎంతో మంది నిరుద్యోగులు ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. కాలుష్యం ఇక్కడ ప్రజలది. సంపాదన ఎక్కడి వారికో వెళ్తుందని అన్నారు. స్థానిక పరిశ్రమల్లో 10 శాతం ఉద్యోగాలు కూడా ఇవ్వడం లేదన్న సంగతి నిరుద్యోగులు గ్రహించాలన్నారు. తాను పోరాటం చేస్తే ఫలితం వచ్చేవరకూ ఆపేది లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ విషయం మీకందరికి తెలిసిందే కదా అన్నారు. తాను కూడా ఈ ప్రాంతం వాడినేనన్నారు. నెల్లిమర్ల మండలం సారిపల్లిలో మా తల్లిదండ్రులు పుట్టారన్నారు. తాను చిట్టివలసలో పుట్టానన్నారు. తనకు ఈ ప్రాంతానికి విడదీయలేని బందం ఉందన్నారు. ఈ ప్రాంతానికి ఈ పరిశ్రమలు వల్ల ఒక్క శాతం లాభం లేదన్నారు. సరియైన రోడ్లులేవు, స్వచ్ఛమైన గాలిపీల్చుకోవడానికి అవకాశం లేదని అన్నారు. ప్రజలుకు న్యాయం జరిగేవరకూ పోరాటం చేస్తానన్నారు. మెజార్టీ ప్రజలు తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లో మార్పు కోరుకుంటున్నారన్నారు. చంద్రబాబు, జగన్మోహన్‌రెడ్డి దోచుకున్న వారని ప్రజలకు అర్థమైపోయిందన్నారు. జగను తెచ్చిన అప్పులకు వడ్డీ కట్టలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. చంద్రబాబు సీమాంధ్రను సింగపూర్ చేస్తానన్నారని, ఇందంతా రాజకీయ నాటకమేనని అన్నారు. ప్రజల్లో మార్పు రావాలని, బిజెపి తొత్తులందరికీ బుద్ధి చెప్పాలని అన్నారు.

మాట్లాడుతున్న కెఎ పాల్

ఎన్‌సిబిసి సమావేశంలో ఎమ్‌పి బెల్లాన

ప్రజాశక్తి- విజయనగరం

ఢిల్లీలో బుధవారం జరిగిన జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ (నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ - ఎన్‌సిబిసి) సమావేశానికి కేంద్ర ఒబిసి కమిటీసభ్యులు, విజయనగరం ఎంపి బెల్లాన చంద్ర శేఖర్ హాజరయ్యారు. దేశవ్యాప్తంగా వివిధ కులాలు తమను ఒబిసి జాబితాలో చేర్చాలని చేసిన విజ్ఞప్తులను పరిశీలించేందుకు ఈ కమిషన్ సమావేశమయ్యింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుంచి కూడా తూర్పు కాపు, శిష్ట కరణం, కళింగ కోమటి, కళింగ వైశ్య, సొండి, అరవ తదితర కులాలు నుంచి, తమను ఒబిసి జాబితాలో చేర్చాలని విజ్ఞప్తులు అందాయి. వీటిని కూడా కమిషన్ పరిశీలించింది. రాష్ట్రంలో ఈ కులాల స్థితిగతులను కమిషన్ కు ఎంపి వివరించారు. పరిశీలించి, ఒబిసి జాబితాలో చేర్చాలని కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు ఇద్దరు పిఇటిలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 10న విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ వాలీబాల్ జట్టుకు జిల్లా వాలీబాల్ సంఘం సభ్యులైన నగరంలోని ప్రభుత్వ సంస్కృత పాఠశాల పిఇటి గౌరి, గుర్ల మండలం జెడ్‌పి హైస్కూలుకు చెందిన పిఇటి ఎ.దేవమణి ఎంపికయ్యారు. వీరిద్దరూ అక్టోబర్‌లో కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో జరగనున్న ఆలిండియా రెవెన్యూ వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారు. వీరిని రాష్ట్ర వాలీబాల్ సంఘ కార్యదర్శి భగవాన్ దాస్, జిల్లా వాలీబాల్ సంఘ అధ్యక్షులు సూరిబాబు , జిల్లా జాయింట్ సెక్రటరీ కృష్ణంరాజు, సన్యాసినాయుడు తదితరులు అభినందించారు.

జెఎన్‌టియులో హాక్తాన్ 2కె సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు గురజాడలో మూడు రోజులు పాటు జరిగే హాక్తాన్ 2కె 23 సదస్సు బుధవారం ప్రారంభమైంది. సదస్సును వైస్ ఛాన్సలర్ వెంకట్ సుబ్బయ్య ప్రారంభించారు. నేడు కంప్యూటర్ రంగంలో వస్తున్న సాంకేతిక మార్పులను అంది పుచ్చుకోవడం ద్వారా దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కాగలమన్నారు. ఇటువంటి జాతీయ సెమినార్లు నిర్వహించుకోవడం ద్వారా విజ్ఞానాన్ని పంచుకునే అవకాశం ఉంటుందన్నారు. సిఎస్ఇ డిపార్ట్మెంట్ విద్యార్థులు మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రాజేశ్వరరావు సాంకేతికత దాని ఉపయోగాలు గురించి వివరించారు.

నేడు, రేపు స్కూల్ గేమ్స్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో గురు, శుక్రవారాలు స్కూల్ గేమ్స్‌పోటీలు, ఎంపికలు జరగనున్నాయని స్కూల్ గేమ్స్ నియోజకవర్గ ఇంచార్జి సంజీవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం అర్బన్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులు హాజరు కావాలని కోరారు. గురువారం వాలీబాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఎంపికలు జరుగుతాయని తెలిపారు. శుక్రవారం ఖో ఖో, త్రోబాల్, టెన్నీ కాయిట్, యోగ క్రీడలకు ఎంపిక జరుగుతందన్నారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు రాజీవ్ క్రీడా ప్రాంగణంలో హాజరు కావాలని కోరారు.

నలుగురితో శాలివాహన సంక్షేమ కమిటీ

ప్రభుత్వ వేడుకగా కవయిత్రి మొల్ల జయంతి

శాలివాహన కార్పొరేషన్ ఛైర్మన్ పురుషోత్తం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో నలుగురు సభ్యులతో కుమ్మరి, శాలివాహన సంక్షేమ కమిటీ ఏర్పాటైనట్లు ఆ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ మండేపూడి పురుషోత్తం వెల్లడించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటయ్యే అధికారిక కమిటీలో అధికారులతో పాటు, గుర్ల మండలం కోటగండ్రేడుకు చెందిన ఉబ్బిశెట్టి అప్పలస్వామి, లక్కవరపు కోట మండలం రంగరాయపురానికి చెందిన స్వయంబారకు కనకారావు, విజయనగరంలోని దాసన్నపేటకు చెందిన దొండిగల్లు పాపారావు, గజపతినగరం మండలం లోగిశకు చెందిన అరటి లక్ష్మిని సభ్యులుగా కలెక్టర్ నియమించినట్లు తెలిపారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఛైర్మన్ జిల్లా కలెక్టర్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలివాహన కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేదోడు పథకం కుండలు తయారుచేసే వారికి కూడా వర్తింప చేయాలని ముఖ్యమంత్రిని కోరామని,త్వరలోనే కుమ్మరి వృత్తివారికి కూడా ఈ పథకం కింద రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించే అవకాశం ఉందని అన్నారు. కవయిత్రి మొల్ల జయంతిని మార్చి 13న ప్రభుత్వ వేడుకగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని చెప్పారు. కవయిత్రి మొల్లపై తితిదే రూపొందించిన పుస్తకం త్వరలోనే విడుదల కానుందని వెల్లడించారు. ఆయన వెంట జిల్లా బిసి సంక్షేమాధికారి యశోధనరావు, బిసి కార్పొరేషన్ ఇడి జి.పెంటోజీ రావు ఉన్నారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పురుషోత్తం

జెఎన్‌టియు జంక్షన్ వద్ద

హెల్త్ గ్రీవెన్సుకు ప్రత్యేక కౌంటర్

ప్రజాశక్తి-విజయనగరం

వైద్య పరమైన సహాయం, సిఎం సహాయ నిధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి విజ్ఞప్తి చేయడానికి జెఎన్‌టయు జంక్షన్ సమీపంలోని హెలిపాడ్ బయట కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన రోజు ఈనెల 15న తమ ఆరోగ్య పరమైన వినతులను ఈ ప్రత్యేక కౌంటర్‌వద్ద అందజేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో డిపిఒకు గాయాలు

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని కోట జంక్షన్ వద్ద బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లా పంచాయతీ అధికారిశ్రీధర్ రాజా గాయపడ్డారు. ఉదయం ద్విచక్ర వాహనంపై గుడికి వెళ్లివస్తున్న ఆయన ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కిందపడిపోయారు. ఈఘటనలో ఆయన కాలు విరిగిపోయింది. వెంటనే విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆయన కాలికి శస్త్రచికిత్స చేశారు.

రహా 'దారుణాలు'

జిల్లా వ్యాప్తంగా పలు మండల కేంద్రాలతో పాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు అధ్వాన్నంగా తయారయ్యాయి. దీంతో ప్రయాణం నరకయాతనగా మారిందని ప్రజలు వాపోతున్నారు. ప్రధాన రహదారులు సైతం గోతులుమయం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో రోడ్లపై పడిన గోతులు నీటితో నిండి ప్రమాదకరంగా మారాయి. మరమ్మతులకు గురైన రహదారులను బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నెల్లిమర్ల: మొయిద జంక్షన్ సమీపంలో రోడ్డుపై నిలిచిన వర్షంనీరు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అర్అండ్‌బి అధికారుల నిర్లక్ష్యంతో రహదార్లు చెరువుల్లా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. నగర పంచాయతీ పరిధి మొయిద జంక్షన్ నుంచి జరజాపు పేట వెళ్లే రహదారిలో కల్వర్టు పూడుకు పోయి మురుగు నీరు రోడ్డు మీదకి వచ్చి వాహన దారులు, ప్రయాణీకులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని చెబుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో మరింత వర్షపు నీరు ఈ ప్రాంతంలో చెరువులా తలపిస్తుందని వాపోతున్నారు. కల్వర్టు వెడల్పు చేయడం ద్వారా పూడిక నివారించి నీరు నిల్వ లేకుండా చేయాలని కోరుతున్నారు. రామ తీర్థం గ్రామంలో నడిబొడ్డున ఇదే పరిస్థితి ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ గ్రామంలో మరుగు నీరు రహదారి పై ప్రవహించి గుంతలు పడి వాహన దార్లు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రహదార్లు, భవనాల శాఖ స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

అధ్వానంగా ప్రధాన రహదారులు

వంగర: మండలంలోని ప్రధాన రహదారులన్నీ పూర్తిగా మరమ్మతులకు గురవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుండి రాజాం పట్టణానికి వెళ్లే ఆర్ అండ్ బి ప్రధాన రహదారి అరసాడ వరకు, అరసాడ నుండి నీలయ్య వలస వైపు వివిధ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి, వంగర నుండి శివ్వాం మీదుగా తలగాం, రుషింగి వైపు వెళ్లే ఆర్ అండ్ బి రహదారి, బంగారు వలస, కొండ చాకరాపల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారి, మడ్డువలస నుండి జగన్నాథ్ వలస మీదుగా నీలయ్య వలస వెళ్లే ప్రధాన రహదారి గోతులు మయంగా ఉండడంతో ప్రజలు ప్రయాణించేటప్పుడు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు కూడా మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయాలలో అంబులెన్స్ కూడా ఈ రహదారుల మీదుగా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి రహదారుల పరిస్థితి పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతి నిధులు జోక్యం చేసుకొని రహదారులు బాగు చేయాలని కోరుతున్నారు.

వంగర: అరసాడ, నీలయ్యవలస మధ్య రోడ్డు పరిస్థితి..

నడక నరకయాతన

వేపాడ: మండలంలోని బొద్దాం జంక్షన్ నుండి ముకుందపురం వెళ్లే రోడ్డు, వేపాడు మీదుగా ఆనందపురం వెళ్లే రోడ్డు, వల్లంపూడి నుండి వేపాడ వరకు వెళ్లి రోడ్డు అధ్వాన్నంగా తయారయ్యాయి. గత రెండు రోజులుగా పడుతున్న వర్షానికి గుంతలలో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ఇప్పటికే పలుమార్లు ఈ సమస్యపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు.

వేపాడ, వల్లంపూడి రోడ్డుకు మధ్యలో ఏర్పడిన గొయ్యి

గోతులమయం.. పురిటిపెంట రహదారి

గజపతినగరం: నియోజకవర్గంలో మేజర్ పంచాయతీ అయిన పురిటిపెంట నుండి ఆంధ్ర వరకు సుమారు 15 కిలోమీటర్లు రహదారిని పూర్తిగా అధ్వాన్నంగా తయారైంది. పెద్ద పెద్ద లారీలు, వాహనాలు తిరగడంతో రోడ్లు ఛిద్రమైపోయాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు నిల్వ ఉండడంతో కొన్నిచోట్ల రోడ్లు కుంగిపోవడం, మరికొన్నిచోట్ల పెద్దపెద్ద గుంతలుగా ఏర్పడడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు, నాయకులు స్పందించి తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గోతులమయమైన పురిటిపెంట రహదారి

బొబ్బిలి: బొబ్బిలి నియోజకవర్గంలో రోడ్లు అద్వాన్నంగా మారాయి. పూల్‌బాగ్ రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు గోతులుమయంగా మారడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూల్‌బాగ్ రహదారిపై నుంచి బలిజిపేట, తెర్లాం, రాజాం, శ్రీకాకుళం ప్రాంతాలకు రాకపోకలు చేస్తుంటారు. ఈ రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వరదనీరు గోతులలో చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. రోడ్డు బాగు చేసేందుకు మున్సిపల్ సాధారణ నిధులు నుంచి రూ.40లక్షలు మంజూరు చేసి పనులు ప్రారంభించినా పూర్తి చేయలేదు. రైల్వే స్టేషన్ రోడ్డు మీదుగా రైల్వే వ్యాగన్ లారీలు వెళ్లడంతో రోడ్డు పాడైపోయింది. రోడ్డు పాడైపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లు బాగు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఇదీ పూల్ బాగ్ రోడ్డు పరిస్థితి

రైతులకు అందుబాటులో ఉండాలి

గంట్యాడ: పశువైద్యాధికారులందరూ రైతులకు అందుబాటులో ఉండాలని పశువైద్య జాయింట్ డైరెక్టర్ ఏ. విశ్వేశ్వరరావు అన్నారు. ఆయన బుధవారం నరవ, నీలావతి, పెన్సాం, బుడతనాపల్లి, కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన పథకాలు రైతులకు అందేలా చేయాల్సి బాధ్యత పశువైద్యాధికారులపై ఉందన్నారు. 1962 సేవలు అందరికీ అందే విధంగా పనిచేయాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. రైతు భరోసా కేంద్రాలను పరిశీలించారు. పాడి పశువులకు మెరుగైన వైద్యం అందించి పాడి రైతుల అభివృద్ధికి కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గంట్యాడ ప్రాంతీయ పశువైద్యశాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సహాయ సంచాలకులు రెడ్డి కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రోగికి రూ.10 వేలు ఆర్థిక సాయం

పూసపాటిరేగ : మండలంలోని గోవిందపురంలో దలిత కాలనీకి చెందిన రోగి ఎలక ఈశ్వరమ్మ (50)కు గ్రామ ఉప సర్పంచ్ బాలా అప్పలరాజు బుధవారం పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈశ్వరమ్మకు భర్త మహాలక్ష్మి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. గత కొంత కాలంగా అనారోగ్యానికి గురైంది. ఇటీవల విజయనగరం ఆసుపత్రిలో చికిత్స చేయించారు. వ్యాధి నయం కాకపోవడంతో విశాఖపట్నం కేజిహెచ్‌కు తీసుకువెల్లాలని వైద్యులు సూచించారు. కేజిహెచ్‌కు కూడా తీసుకువెల్లడానికి వారికి అవకాశం లేకపోవడంతో స్వగ్రామం గోవిందపురం తీసుకువచ్చేసారు. విషయం తెలుసుకున్న అప్పలరాజు వారిని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేసారు. కుటుంబీకులు ఒప్పుకుంటే కేజిహెచ్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తానన్నారు. ప్రతి రోజు స్థానిక పిహెచ్‌సి నుండి వైద్యం అందించేలా వైద్య సిబ్బందితో మాట్లాడారు. ఆయనతో పాటు సచివాలయ ఉద్యోగులు, గ్రామస్థులు ఉన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

శృంగవరపుకోట: అమ్మ సహాయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనిల్ నీరుకొండ ఆసుపత్రి వారి సౌజన్యంతో పట్టణంలోని గొల్ల వీధిలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని అమ్మ సహాయం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీను డాక్టర్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 150 మంది రోగులు పాల్గొనగా అందులో ఎక్కువగా మహిళలు, వృద్ధులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారని వారికి రోగాన్ని బట్టి మందులు కూడా అందించామన్నారు. ఈ వైద్య శిబిరంలో అనిల్ నీరుకొండ ఆసుపత్రికి చెందిన ఎనిమిది మంది వైద్య నిపుణులు పాల్గొని వైద్య సేవలు అందించారన్నారు.

పోషకాహారంపై అవగాహన

వంగర: మండలంలోని మగ్గూరు అంగన్వాడి కేంద్రం -1లో గర్భిణులు, బాలింతలకు సెక్టార్ సూపర్ వైజర్ దుర్గారాణి బుధవారం అవగాహన కల్పించారు. పోషకాహార మాసోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. తల్లిపాలు ప్రాముఖ్యతను వివరించారు. అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం పరిశీలన

డెంకాడ: మండలంలోని డీ-కొల్లం పంచాయితీ పరిధిలోని ఆర్ ముంగినాపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌ను జిల్లా ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ భాస్కరరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవలు గురించి ఆరా తీశారు. వైద్యానికి వచ్చిన రోగులను వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భవాని, ఎంపిహెచ్ఎస్ ఎం.కె గురుభక్తుడు, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్, ఏఎన్ఎం ఇందిరా, ఎంఎల్ఎచ్ఒ లోకేష్, ఆశకార్యకర్త రాములమ్మ పాల్గొన్నారు.

కేన్సర్ రోగికి దళిత నాయకుల పరామర్శ

నెల్లిమర్ల: మండలంలోని సతివాడ గ్రామానికి చెందిన ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు దన్నాన గోవింద్ తండ్రి బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న దళిత నాయకులు బుధవారం అతన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ కమిటీ కార్యదర్శి చీకటి సుహాసిని, పార్లమెంటు ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు కనిగిరి శ్రీనివాసరావు, నెల్లిమర్ల నియోజకవర్గం అధ్యక్షులు గంధవరపు హరిబాబు, బగ్గ రామారావు, బట్టాన రామారావు, సామాదుల వెంకటరమణ, మాత గోపి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కొత్తవలస: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల జిల్లా పరిషత్ స్కూల్లో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ ఈశ్వరావు ఆధ్వర్యంలో 625 మంది విద్యార్థులకు బుధవారం స్క్రీనింగ్ చేయగా 26 మంది విద్యార్థులకి కళ్లద్దాలకు ఎంపిక చేశారు. ఒకరిని సర్జరీకి రెఫెర్ చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ డి. సీతల్ వర్మ తెలిపారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ సిహెచ్ ఈశ్వరరావు మాట్లాడుతూ కంటికి సంబంచిన వ్యాధులు రాకుండా ఉండాలంటే ఆకుకూరలు, పండ్లు, పాలు, గుడ్లు, క్యారెట్, బొప్పాయి, మునగాకు వంటి ఆహార పదార్థాలు తినాలనిన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ఈ నెల 30 నుండి మెగా ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామని ఆ క్యాంపులో ఐ స్క్రీనింగ్ అయిన పిల్లలకు వైద్యం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎమ్స్ రమణమ్మ, హెల్త్ అసిస్టెంట్ ప్రసాదరావు, ఆశ వర్కర్స్ జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి సామగ్రి వితరణ

బొబ్బిలి: స్థానిక గ్రంథాలయానికి టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన ఐదు ఫ్యాన్లు, నాలుగు బెంచీలు, మూడు లైట్లు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను బుధవారం వితరణగా అందించారు. వీటిని గ్రంథాలయాధికారి స్వర్ణకుమారికు టిడిపి సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి అందజేశారు. గ్రంథాలయ అభివృద్ధికి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని బేబినాయన అన్నారు.

సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌దే

ప్రజాశక్తి - కొత్తవలస

ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డికి దక్కిందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలో నూతనంగా మంజూరైన పెన్షన్లు ఎంపిడిఒ వై. పద్మజ ఆధ్వర్యంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో నూతనంగా 392 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ జగనన్నకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, కొత్తవలస మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, పిఎసిఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, వైస్ ఎంపిపి కర్రి శ్రీను, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం: పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎంపిపి మామిడి

నెల్లిమర్ల : సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి వైసిపి ప్రభుత్వం పునాది వేస్తుందని జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు అన్నారు. బుధవారం కొండవెలగాడలో వైఎస్ఆర్ పింఛను కానుకలో 2వ విడత మంజూరైన 13 మంది ఆయన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 300 పింఛన్లు ఉండగా ఈ ప్రభుత్వం వచ్చిన తరువాతో అదనంగా మరో 315 పింఛన్లు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొయిద అక్కోజీ, వల్లూరి రాము, రేవల్ల సింహచలం, పంచాయతి కార్యదర్శి యర్ర రమణ, వెల్ఫేర్ అసిస్టెంట్ కె. గోవిందరావు, సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం: మండలంలోని ద్వారపూడిలో నూతనంగా మంజూరైన పింఛన్లను ఎంపిపి మామిడి అప్పలనాయుడు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛను అందించే బాధ్యతను సిఎం జగన్మోహన్‌రెడ్డి తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బూడి ప్రవీణ్, జామి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోటలో గడపగడపకు

శృంగవరపుకోట: 262వ రోజు పట్టణంలోని గ్రామ సచివాలయం-2 పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ప్రభుత్వం పాలన వ్యత్యాసాలు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించటం, ఇంకా ఏమైనా సమస్యలు వుంటే తెలుసుకొని అక్కడికి అక్కడే సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటూ, నేరుగా ప్రజలతో కలసి వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, మండల జెసిఎస్ ఇంచార్జ్ వాకాడ సతీష్, ఏఎంసీ డైరెక్టర్ పార్వతి, వార్డు సభ్యులు మజ్జి శేఖర్, కోసూరి భారతి, కొఠాని ఈశ్వరి, ఆవాల కృష్ణ, సరిపల్లి గణేష్, సీతంపేట అప్పల సత్యం, మోపాడ కోటి, నిరుజ్యోగి శ్రీను, సీతంపేట నాగరాజు, పాల్గొన్నారు.

నాణ్యమైన సరుకులు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - కొత్తవలస

విద్యార్థులకు నాణ్యమైన సరుకులను అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం. హర్ష డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం ఎస్ఎఫ్ఐ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా హర్ష మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రవేశ పెట్టిన జగనన్న గోరుముద్ద అమలు హడావుడి, ఫోటోలకు తప్పించి విద్యార్థులకు ఉపయోగపడలేదన్నారు. విద్యార్థులకిచ్చే రాగి మాల్ట్ (అంబలి), బెల్లం, బియ్యం వంటి ఆహార సరుకులు నాసిరకంగా ఉన్నాయని దీనివల్ల విద్యార్థులు తినడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించే విధంగా నాణ్యమైన ఆహార సరుకులు పంపిణీ చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని తహశీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు చైతన్య, సాయి వినయ్, అరుణ్, గణేష్, ఎర్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతి పత్రాన్నిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఘనంగా ఎంఎస్ నాయుడు జయంతి

ప్రజాశక్తి- మెరకముడిదాం

ఎస్ ఇండియా సంస్థ స్థాపకుడు, కీర్తి శేషులు ఎంఎస్ నాయుడు జయంతిని పురస్కరించుకుని బుధవారం ఆయన స్వగ్రామం పెద్దమంత్రి పేటలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. హర శ్రీరాములు ఆధ్వర్యంలో ఎంఎస్ నాయుడు చిత్ర పటానికి పూల మాలలు వేసి గ్రామానికి, పేద విద్యార్థులకు ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా అతని మేనల్లుడు, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. హర శ్రీరాములు మాట్లాడుతూ ఒక కుగ్రామంలో పుట్టి, వెస్ట్ జర్మనీలో స్థిరపడి తన గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయటమే కాకుండా అనేక గ్రామాలలో ఉన్న పేద విద్యార్థుల కోసం సేవ చేద్దామనే మంచి శంకల్పంతో ఎస్ ఇండియా అనే సంవస్థను స్థాపించి దాని ద్వారా పేద విద్యార్థులకు స్కాలర్ సిప్ అందిచారన్నారు. ఈ సేవా కార్యక్రమాలు అక్టోబర్ రెండు గాంధీ జయంతి వరకు అన్ని గ్రామాలలో చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ క్రిష్ణ మూర్తి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంఎస్ నాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రాకపోకలకు ఇబ్బందులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురం జంక్షన్ నుంచి వేపాడ మీదుగా ఆనందపురం వరకూ రూ.39కోట్లతో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. అయితే అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు రద్దీగా ఉన్న సమయంలో పనులు చేపట్టడం వల్ల బుధవారం ఆకులు సీతంపేట వద్ద కల్వర్టు పనులు జరగడంతో బస్సులు, లారీలు ఇతర వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, విద్యార్థులు నానా ఇబ్బందులు పడ్డారు. పాఠశాలకు వెళ్లే బడి బస్సులు, ఆటోలపై ప్రయాణించే విద్యార్థులు, ప్రయాణికులు గంటల తరబడి నిలిపివేయవలసి వచ్చింది. ప్రతి రోజూ ఇలాగే జరగడం వల్ల పాఠశాలకు వెళ్లే విద్యార్థులు సకాలంలో పాఠశాలకు చేరలేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రయాణికులకు ఆటంకం లేకుండా పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉపాధ్యాయినికి సన్మానం

ప్రజాశక్తి- రేగిడి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయిని బూరవెల్లి ఉమామహేశ్వరి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎన్నికైన సందర్భంగా బుధవారం ఆ పాఠశాలలో సర్పంచ్ కిమిడి శివశంకర్, ఎంఇఒ ఎంవి ప్రసాద్‌రావులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.లక్ష్మణరావు, పూర్వ ప్రధానోపాధ్యా యులు, ప్రస్తుత సంకిలి హెచ్ఎం ఎం రామి నాయుడు, ఎస్ఎంసి చైర్మన్ ఎం రామకృష్ణ, రెడ్ క్రాస్ ప్రతినిధులు కొత్తా సాయి ప్రశాంత్, బివి అచ్యుత్, కొత్తూరు ఎంఇఒ గోవింద్, ఘంటసాల సంగీత కళాశాల ప్రిన్సిపల్ ఎం ప్రసాద రావు, స్కూల్ కాంప్లెక్స్ సైన్స్ ఉపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'నాక్' కు సన్నద్ధం కావాలి

నెల్లిమర్ల: సెంచూరియన్ విశ్వ విద్యాలయం 'నాక్'కు సన్నద్ధం కావాలని వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డి.ఎన్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం సెంచూరియన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'నాక్' నిబంధనల మేరకు బోధన పద్ధతులతో పాటు యుజిసి గుర్తింపు పొందిన మ్యాగజైన్లలో వ్యాసాలు ప్రచురితమయ్యే విధంగా కృషి చేయాలన్నారు. సిఎస్ఆర్ కార్యక్రమాలు ఎక్కువగా చేపట్టాలన్నారు. పేటెంట్స్ పొందడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ పి. కె. మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పి. పల్లవి, ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పిఎస్వి రమణారావు, అసోసియేట్ డీన్ సన్నీ డియోల్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష పై అవగాహన కల్పించాలని కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ సూచించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో వార్డు శానిటేషన్ కార్యదర్శులు, ఎఎన్ఎంలు, ఆశాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 30నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సదస్సులు నిర్వహించాలన్నారు. దీనిలో భాగంగా వాలంటీర్లు వారీగా ఇంటింటి సర్వే చేసి, క్యాంపు ఆవశ్యకత, ఆరోగ్యశ్రీ కింద ఆరోగ్య సేవలను ఉచితంగా ఎలా పొందవచ్చో, స్మార్ట్ ఫోన్‌లలో ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయడం, ఆరోగ్యశ్రీ యాప్ లక్షణాలు తెలియజేస్తారన్నారు. సర్వేలో వ్యాధి, పుట్టుకతో వచ్చే లోపాలు, వైకల్యం, అభివృద్ధి లోపాల కేసులను గుర్తించి నిర్వహించబోవు క్యాంపుకు హాజరయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పిహెచ్‌సి డాక్టర్ సమీరా, నగర పంచాయతీ మేనేజర్ టివిఎస్ విశ్వేశ్వర రావు, హెల్త్ అసిస్టెంట్ డి.ఉమా భాస్కర్ పాల్గొన్నారు.

విజయనగరం: ఈనెల 15నుంచి రాష్ట్రమంతటా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని 45 రోజుల పాటు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ప్రతి ఇంటినీ సందర్శించి 4 దశలలో ఈ కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. గ్రామాల్లో హెల్త్ కాంప్ లు నిర్వహించి అవసరమైన ఆరోగ్య పరీక్షలు చేయడం, మందులు అందించడం, కళ్ళజోళ్ళు ఇవ్వడం, ఆరోగ్య శ్రీ పై అవగాహన కలిగించడం పెద్ద ఎత్తున చేయాలన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఎపిఎస్ ఎంఐడిసి ఎమ్‌డి మురళీధర్ రెడ్డి, డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర రావు, డిసిహెచ్ ఎస్.డాక్టర్ గౌరీశంకర్, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ అప్పల రాజు, జిల్లా పరిషత్ సిఇఒ రాజ్ కుమార్, డిఇఒ లింగేశ్వర్ రెడ్డి, డిఎల్‌డిఒ నిర్మలా దేవి, డిఐఒ, మున్సిపల్ కమిషనర్లు లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని పెద్ద శిర్లాంలో పాము కాటుతో మరణించిన కురిటి ప్రభాకరరావు కుటుంబానికి వైఎస్ఆర్ బీమా తక్షణ సహాయం కింద రూ.10వేలు చెక్కును బుధవారం సర్పంచ్ లెంక రాంబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మృతి చెందిన కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా ఎంతో భరోసానిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ వైఎస్ఆర్ బీమాల చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ సుధీర్, వాలంటీర్లు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై ఎంపిడిఒ ఆగ్రహం

రేగిడి: మండలంలోని 25 గ్రామ సచివాలయాల పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లపై ఎంపిడిఒ శ్యామలా కుమారి మండిపడ్డారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం కార్యదర్శిలు, డిజిటల్ అసిస్టెంట్లతో ఆమె సమావేశం నిర్వహిం చారు. కొత్తగా ఆమె బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారి పెట్టిన సచివాలయ పరిధిలో ఉన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించాల నుకున్నారు. కానీ అనుకున్న స్థాయిలో సచివాలయం ఉద్యోగుల సమావేశానికి హాజరు కాలేదు. 25 సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు 50 మంది హాజరు కావలసి ఉండగా కొంతమంది మాత్రమే సమావేశాలకు హాజరు కావ డంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశాలకు సమ యాలు పాటించక పోవడం, కొంతమంది గైర్హాజరు కావడంతో అసహనం వ్యక్తం చేశారు. సమయాలకు సమావేశాలకు రాకుంటే చర్యలు తప్పవని హెచ్చరిం చారు. సీనియర్ సహాయకులు వెంకట రమణ, గోవింద ఉన్నారు.

అధ్యాపకుడికి లెఫ్ట్‌నెంట్ హోదా

విజయనగరం : స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన అధ్యాపకుడు ఎస్.ప్రశాంత్ లెఫ్ట్‌నెంట్ హోదా లభించింది. 28 టిఆర్, ఎన్‌సిసి విశాఖపట్నం తరపున, ఎన్‌సిసి ఆఫీసర్ ట్రైనింగ్ అకాడమీ మధ్యప్రదేశ్‌లో మూడు నెలలపాటు శిక్షణను పూర్తిచేసుకుని లెఫ్ట్‌నెంట్ హోదా సాధించారు. ఈసందర్భంగా ఆయనను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి, లెఫ్ట్‌నెంట్ మజ్జివరలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ దామోదర్‌నాయుడు తదితరులు అభినందించారు.

ప్రశాంత్‌ను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

బాల్య వివాహాలకు ముగింపు

గుర్ల : బాల్య వివాహాలకు ముగింపు పలకాలని సామాజిక, పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయాధికారి బి.రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని నడుపూరు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, రక్తహీనత, పౌష్టికాహారం, జంక్ ఫుడ్ వల్ల కలిగే ప్రమాదాలు, కెరీర్ గైడెన్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాల్యంలో బాగా చదువుకొని ఉన్నత స్థానంలో స్థిరపడాలన్నారు. బాల్య వివాహాల వల్ల కొందరు పేదరిక విష వలయంలో చిక్కుకొంటున్నారని, అనారోగ్యాలతో మరణాలు సంభవిస్తున్నాయని వివరించారు. బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 112 నంబరునకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి హెచ్ఎం సూర్య కుమారి, నరసింహారావు, కృష్ణ బాబు, కోట్ల పద్మ, ఎ.ఎన్.ఎం కన్నతల్లి విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

గజపతినగరం: మండల కేంద్రంలో బుధవారం ఆటో లారీ ఢీకొన్న ఘటనలో ఏడుగురుకు గాయాలయ్యాయి. పెదకాడ గ్రామానికి చెందిన కూరగాయల వ్యాపారులు ఆటోలో విజయనగరం వెళుతుండగా స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ దగ్గర ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో నలుగురును స్థానిక ప్రాంతీయ ఆసుపత్రికి, ముగ్గురును కేంద్రాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ముగ్గురికి గాయాలు

బొబ్బిలి: పట్టణంలోని రైల్వే ఫ్లై ఓవర్ శ్రీఆంజనేయ స్వామి ఆలయం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సాలూరు పట్టణంలోని కర్రి వీధికి చెందిన జి. శంకర్(35) దుర్మరణం చెందగా ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వివరాలు మేరకు పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు మోటారు సైకిల్ పై మితిమీరిన వేగంతో వెళ్తూ నడుచుకుని రోడ్డు దాటుతున్న ఒక వ్యక్తిని ఢీకొనడంతో అతని అక్కడికక్కడే దుర్మరణం చెందగా మోటారు సైకిల్ పై వెళ్తున్న యువకులు పవన్, హేమంత్, జోసెఫ్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ముగ్గురిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

మృతి చెందిన శంకర్

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE, VIZIANAGARAM
E.P. 52/2017 IN O.S. 247/2015

Between:
Pathivada Appalanaidu ...Dhr
And:
Veturu Venkata Mahalakshmi ...Jdr
To:

NOTICE

Veturu Venkata Mahalakshmi W/o Late Narasinga Rao, resident of Rellivalasa village, Poosapatirega Mandal, Vizianagaram District.

Please take notice that the Dhr filed the above case against you for attachment and the above matter stands posted to **15.09.2023.** Therefore, you have to appear before the above said court either personally or through an Advocate duly authorized at **10-30 A.M., on 15.09.2023** before the above court. Failing which the matter will be decided as per the material available on record.

CH. RAMBABU,
ADVOCATE FOR PETITIONER,
VIZIANAGARAM